ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024



రైలు ప్రమాదం వెనుక సిబ్బంది నిర్లక్ష్యం

- ప్లాట్‌ఫారంపై అంతసేపు ఎందుకు ఉంచారు?
- బీ-6, బీ-7లలో గ్యాస్ సమస్య నిజమేనా!!
- సీసీ టీవీ పుటేజీ ఏమి చెబుతోంది?
- స్మోక్ సెన్సార్ల సంగతి ఏమిటి?
- బీ-7 టీటీఈ, ప్రయాణికులను విచారిస్తేనే నిజాలు



- వార్త 7వ పేజీలో..

భారీగా మొక్కల పెంపకానికి ప్రతిపాదనలు

- ఉపాధి హామీ కింద చేపట్టాలని నిర్ణయం
- ఎన్టీపీసీ ఆర్థిక సాయంతో సామాజిక వనాలు అభివృద్ధి
- సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్



జి.లక్ష్మణ్, సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో

అనకాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 16.40 లక్షల సరుగుడు, 3.43 లక్షల టేకు, ఏగిస, సంపంగి, నేరేడు, పనస, మామిడి మొక్కల పెంపకానికి ప్రతిపాదనలు రూపొందించామని సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 5 లక్షల టేకు మొక్కలు పంపిణీ చేసేందుకు కశింకోట, సబ్బవరం, కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ, చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి, మాకవరపాలెం మండలాల్లో ఇప్పటికే నర్సరీలు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. జిల్లాలో సామాజిక అటవీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. జిల్లాలో సామాజిక వనాల అభివృద్ధిలో భాగంగా 2023-24 సంవత్సరంలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆర్థిక సాయంతో 36 హెక్టార్లలో 80 వేల మొక్కలు నాటించి వాటిని సంరక్షిస్తున్నామన్నారు. వంద కిలో మీటర్ల పొడవున రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించామని చెప్పారు. ఎన్టీపీసీ సామాజిక బాధ్యత నిధులతో 2024-25 సంవత్సరంలో 8వ విడత ప్రణాళిక కింద మరో 40 వేల మొక్కల పెంపకంతో పాటు 37 కిలోమీటర్ల రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించేందుకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. రీ జనరేషన్ ఫండ్స్ కింద 10 లక్షల కొబ్బరి మొక్కలను రైతులకు రాయితీ ధరకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని చెప్పారు. మొక్కల ధరలు జిల్లా సామాజిక అటవీ విభాగం కమిటీ ఛైర్మన్ కలెక్టర్ నిర్ణయిస్తారన్నారు. వీటిని రైతులు, కర్మాగారాలు, ఇతర సంస్థలకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. మిక్స్‌డ్ స్కీమ్ కింద జిల్లాలో 2 లక్షల నానాజాతి మొక్కల పెంపకం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. 2024-25 సంవత్సరానికి కంపా అటవీ శాఖ ప్లాంటేషన్ ప్రోగ్రామ్ కింద ప్రభుత్వ బంజరు, అటవీ భూముల్లో 1.6 లక్షల నానాజాతి మొక్కలు పెంపకానికి ప్రతిపాదనలు రూపొందించామని ఆయన వెల్లడించారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

- సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన డాక్టర్ అశోక్‌కుమార్
- డీఎంఈ నుంచి తనకు సమాచారం లేదన్న ప్రస్తుత సూపరింటెండెంట్ శివానంద
- ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ వెళ్లిపోయిన పూర్వపు సూపరింటెండెంట్

- వార్త 7వ పేజీలో..

వైసీపీ అండతో సబ్బవరంలో దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

భూ బకాసురుడు

- గెడ్డ వాగులు, బంజరు.. జిరాయితీలో కలిపేశారు
- అక్రమంగా లే అవుట్లు... విక్రయాలు
- మూడు గ్రామాల సరిహద్దు రాళ్లు మార్చేసి దందా
- స.హ. చట్టంతో వెలుగులోకి అక్రమాలు
- రైతులు ఆందోళనలు చేసినా స్పందించని యంత్రాంగం
- ప్రభుత్వం మారినా తీరు మారని అధికారులు
- కబ్జాకు గురైన భూమి విలువ రూ.25 కోట్ల పైమాటే



ఇరువాడలో సర్వే నంబర్లు 106, 103లో గెడ్డ వాగు ఆక్రమించి లేఅవుట్‌కు రోడ్డు వేసిన దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారినా రెవెన్యూ యంత్రాంగం తీరులో మార్పు కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గెడ్డ వాగులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు, నిరసనలు, ధర్నాలు చేసినా పట్టించుకోని అధికారులు ఇప్పటికీ ఆ ధోరణి వీడడంలేదు సరికదా కబ్జా రాయుళ్లకు దన్నుగా నిలిచి, అక్రమాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఇరువాడ సర్వే నంబర్లు 106, 103లో 13.36 ఎకరాల గెడ్డవాగు పోరంబోకు భూములున్నాయి. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి (బైపాస్)ను ఆనుకొని వాగులు ప్రవహిస్తున్నాయి. వీటి నుంచి వచ్చే వర్షపు నీటితో ఈ భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. రాజకీయ పలుకుబడి, అధికారులను మేనేజ్ చేయగలిగిన ఓ రియల్టర్ కన్ను ఈ భూములపై పడింది. దీంతో గెడ్డ వాగులకు ఆనుకొని ఉన్న కొంత జిరాయితీ భూమి కొనుగోలు చేశారు. గత ఏడాది సుమారు మూడెకరాల వాగును దర్జాగా కలిపేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.25 కోట్లు ఉంటుంది. దీంతో పాటు నేరేడు వృక్షాలను కూల్చివేశారు. జిరాయితీతో సమానంగా గెడ్డ వాగులను గ్రావెల్/మట్టితో పూడ్చేసి లేఅవుట్‌గా మార్చేశారు. దాని చుట్టూ సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించారు. ఈ ఆక్రమణలపై ఆయకట్టు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అప్పట్లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గత నవంబరులో పార్టీ శ్రేణులతో కలిసి బండారు ఆక్రమణకు గురైన వాగు ప్రాంతంలో పర్యటించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వాల్టా, ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదుచేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కబ్జాదారుడికి అప్పటి పెందుర్తి వైసీపీ ఎమ్మెల్యే అండదండలుండడంతో అధికారులు చర్యలకు వెనుకంజ వేశారు. అనంతరం గెడ్డ వాగుల కింద ఉన్న మూడు సాగునీటి చెరువుల (బుట్టాపాత్రుని చెరువు, గైరమ్మ చెరువు, రాజ్ చెరువు) ఆయకట్టు రైతులు గత మార్చిలో తహసీల్దార్, అనకాపల్లి కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు ఇచ్చినా అప్పటి కలెక్టర్ కూడా పట్టించుకోలేదు.



గెడ్డ వాగుల్లో యంత్రాలతో కూల్చివేసిన నేరేడు వృక్షాలు(ఫైల్)

ఇప్పటికీ మారని అధికారుల తీరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరోసారి రైతులు ఫిర్యాదుచేయడంతో రెవెన్యూ అధికారులు వాగులను సర్వే చేసి సర్వే నంబరు 106, 103 గెడ్డ వాగులో సుమారు 1.30 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు తేల్చారు. అయినా ఇప్పటివరకు రియల్టర్‌పై చర్యలు తీసుకోలేదు. వాస్తవంగా సుమారు మూడు ఎకరాలు ఆక్రమణకు గురైతే అధికారులు తూతూమంత్రంగా సర్వేచేసి 1.30 ఎకరాలు మాత్రమే ఆక్రమణకు గురైందని తేల్చడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సర్వే, రెవెన్యూ అధికారులకు ముడుపులు అందాయని రైతులు ఆరోపిస్తున్నారు.

సరిహద్దు రాళ్లు మార్చేసి..

సబ్బవరం, అనకపల్లి, గొటివాడ పక్కపక్క గ్రామాలు. సబ్బవరం సర్వే నంబరు 271లో ప్రభుత్వ భూములు, సర్వేనంబరు 274లో జిరాయితీ, అనకపల్లి సర్వే నంబరు 2లో ప్రభుత్వ భూములు, గొటివాడ సర్వే నంబరు 128లో జిరాయితీ భూములున్నాయి. ఈ మూడు గ్రామాల సర్వే నంబర్లు లా వర్సిటీ సమీపంలో ఒకదానికి ఒకటి ఆనుకుని ఉంటాయి. దీంతో సబ్బవరం సర్వే నంబరు 271పై రియల్టర్ కళ్లు పడ్డాయి. సర్వే నంబరు 274లో జిరాయితీ భూమిని కొనుగోలు చేసి, మూడు గ్రామాల సరిహద్దు రాళ్లు మార్చేసి సర్వే నంబరు 271లో ఉన్న సుమారు ఎకరాన్నర ప్రభుత్వ భూమిని జిరాయితీలో కలిపేసుకుని లేఅవుట్ వేసేశారు. ఈ లేఅవుట్‌కు కూడా ఎటువంటి అనుమతులు లేవు. ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుంది.

స.హ.చట్టంతో వెలుగులోకి...

ఇటీవల ఇరువాడకు చెందిన ఒకరు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేయగా జిల్లా సర్వేయర్ ఎస్ .గోపాలరాజు సిబ్బందితో వెళ్లి సర్వే చేశారు. ఎంత భూమి ఆక్రమణకు గురైందనేది ఇప్పటికీ వెల్లడించలేదు. అంతేకాకుండా రియల్టర్ వేసిన లేఅవుట్ అక్రమమేనని ఇరువాడకు చెందిన ఒకరు సమాచార హక్కు చట్టంద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి నాలా సొమ్ము చెల్లించకుండా వేసిన అక్రమ లేఅవుట్‌లో ప్లాట్లు విక్రయించడం చట్టవిరుద్ధమేనని స.హ. చట్టం ద్వారా తేలింది. రెండు ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీపై కూటమి భేటీ





ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశమైన కూటమి నాయకులు

- అభ్యర్థిత్వంపై చర్చ
- పోటీకి నలుగురు సుముఖం
- జాబితాలో గండి బాబ్జీ, పీలా గోవింద్, పీవీజీ కుమార్, తాతయ్యబాబు
- బైరి దిలీప్ చక్రవర్తి పేరు కూడా పరిశీలన
- అధినేతకు ఐదుగురి పేర్లు పంపాలని నిర్ణయం

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ జాబితాలో మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ... మిగతా 8వ పేజీలో

నేడు నోటిఫికేషన్

- 13వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- ఉపసంహరణకు 16 వరకూ గడువు
- 30న పోలింగ్
- విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానున్నదని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్‌జారీచేసిన ... మిగతా 8వ పేజీలో

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

- స్టాండింగ్ కమిటీలో పదికి పది స్థానాలు గెలుచుకునేందుకు కూటమి వ్యూహం
- కనీసం ఐదైనా దక్కించుకునేందుకు వైసీపీ యత్నం
- వ్యూహప్రతివ్యూహాల్లో ఇరుపక్షాల నేతలు
- వైసీపీ కార్పొరేటర్లతో నేడు సుబ్బారెడ్డి సమావేశం
- అనంతరం రహస్య ప్రాంతానికి తరలిస్తారని ప్రచారం
- ఎన్నిక రేపు
- పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేసిన జీవీఎంసీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీకి బుధవారం ఎన్నిక జరగనున్నది. అందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కౌన్సిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇంచుమించు సమానబలం ఉండడంతో ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది పోటీలో నిలిచారు. వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరారు. దీంతో కూటమి బలం ప్రస్తుతం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 48కి తగ్గింది. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల వైఖరి ఇంకా తేలాల్సి ఉంది. కాగా కౌన్సిల్‌లో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండడంతో స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎవరైనా విజయం సాధించాలంటే కనీసం 49 ఓట్లు దక్కించుకోవాల్సి ఉంటుంది. అంటే వైసీపీకి ఒకరు, కూటమికి ఇద్దరు అదనంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే వైసీపీ నుంచి మరో ఆరుగురు కార్పొరేటర్లు మంగళవారం టీడీపీ, జనసేన పార్టీల్లో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరుమీద ... మిగతా 8వ పేజీలో

అనుమతుల్లేని ఆస్పత్రులెన్నో!

అచ్యుతాపురంలో పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న వైనం

- మొత్తం ప్రైవేటు ఆస్పత్రులు 21 ఉంటే 7 మాత్రమే రిజిస్ట్రేషన్
- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ
- రోగుల నుంచి వేలాది రూపాయల వసూలు
- క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖాధికారులు

అచ్యుతాపురం, ఆగస్టు 5: అచ్యుతాపురంలో అనుమతుల్లేని ప్రైవేటు ఆస్పత్రులు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. మొత్తం 21 ఆస్పత్రులు ఉంటే ఇందులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయినవి కేవలం ఏడు మాత్రమే ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కొందరు దర్జాగా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఆర్‌ఎంపీల సంగతైతే చెప్పనవసరం లేదు. కొందరు మెడికల్ షాపులను పెట్టి వెనుక గదిలో చికిత్సలు కూడా చేసేస్తున్నారు. రోగి వస్తే వైద్య పరీక్షల పేరిట వందలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. కాలికి దెబ్బ తగిలి ఓ ఆస్పత్రికి వెళితే వైద్య పరీక్షలకు రూ.1500, మందులకు రూ.500, డాక్టర్ ఫీజు రూ.200 కలిపి మొత్తం రూ.2,200 వసూలు చేశారని నవీన్ అనే యువకుడు తెలిపాడు. జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళితే పరీక్షలు చేసి టైఫాయిడ్ వచ్చిందని, ఆస్పత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాలని చెప్పారని, ఆస్పత్రి నుంచి బయటకు వచ్చేసరికి రూ.12 వేలు బిల్ అయ్యిందని పూడిమడకకు చెందిన ఓ మత్స్యకారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇటువంటి సంఘటనలు చాలా ఉన్నాయి.



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆస్పత్రులు

ఆస్పత్రుల ఇష్టారాజ్యం

అచ్యుతాపురంలో 30 వేల మంది జనాభా ఉన్నారు. వీరితో పాటు సెజ్‌లో పని చేస్తున్న వివిధ రాష్ట్రాల కార్మికులు ఈ ఆస్పత్రులను ఆశ్రయిస్తుంటారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అని పెద్ద బోర్డు కనిపించే సరికి ఆ ఆస్పత్రులకు వెళ్లి వేలాది రూపాయలు సమర్పించుకుంటున్నారు. వైద్య పరీక్షలు, బెడ్ చార్జీలు, మందులు, డాక్టర్ ఫీజు పేరిట దోచుకుంటున్న ఆస్పత్రుల యాజమాన్యాలు రోగి పరిస్థితి విషమిస్తే ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించేస్తున్నారు. మరణాలు సంభవించినప్పుడు చికిత్స చేసిన వైద్యులు తప్పించుకుంటున్నారని తెలిసింది. కొన్ని అనుమతి పొందిన ఆస్పత్రుల్లో ఒక డాక్టర్, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ అని అనుమతి తెచ్చుకొని ఇక్కడ గదుల్లో మంచాలు, పరుపులువేసి స్థానిక ఆర్‌ఎంపీలతో వైద్యం చేయించి రోగి నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. కరోనా సమయంలో ఒక కేసుకి ... మిగతా 8వ పేజీలో

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మంది ఓటర్లు

- వార్త 7వ పేజీలో..

పట్టణంలో దాహం కేకలు

మూడు రోజులుగా కొళాయి నీరు బంద్

- అల్లాడుతున్న జనం

ఎలమంచిలి, ఆగస్టు 5: పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. గత మూడు రోజులుగా కొళాయి నీరు రాకపోవడంతో జనం అల్లాడిపోతున్నారు. ఎప్పుడు కొళాయి నీరు వస్తుందో తెలియక గంటల తరబడి వేచి ఉంటున్నారు.

పట్టణంలోని భవనం వీధి, నాగేంద్ర కాలనీ, కొత్తపేట, మిలట్రీ కాలనీ వార్డులతో పాటు పలు వార్డుల్లో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సోమవారం తాగునీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా సరే పూర్తి స్థాయిలో నీరు అందక మహిళలు ఇబ్బందులు పడ్డారు. మునిసిపల్ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఉదయం ఆరు గంటల నుంచే మహిళలు కొళాయిల వద్ద బారులుతీరారు. ఎంతసేపటికీ నీరు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. సుమారు 17 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఎస్.రాయవరం మండలం సోముదేవునిపల్లి వద్ద వరహానది వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి పథకం నుంచి ఎలమంచిలి మునిసిపాలిటీకి పైపుల ద్వారా నీరు సరఫరా అవుతుంది. అయితే అక్కడ సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల నీటి సరఫరా నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కొళాయి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎలమంచిలి కొత్తపేట కాలనీలో కొళాయి వద్ద ఉన్న ఖాళీ బిందెలు

క్రైం... crime news

'కల్యాణపులోవ'లో తేలిన చినఅప్పారావు మృతదేహం


కల్యాణపులోవ రిజర్వాయర్‌లో తేలిన చినఅప్పారావు మృతదేహం

రావికమతం, ఆగస్టు 5 : రెండు రోజుల క్రితం అదృశ్యమైన గిరిజన యువకుడు చిన అప్పారావు సోమవారం కల్యాణపులోవ రిజర్వాయర్‌లో శవమై తేలాడు. చీమలపాడు పంచాయతీ శివారు దూకులమ్మపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు అలియాస్ సంజీవి ఈనెల మూడో తేదీ నుంచి కనబడడం లేదని మృతుడు సోదరి గడ్డమ్మ కొత్తకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజులుగా కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి ఆనుకొని ఉన్న కల్యాణపులోవ రిజర్వాయర్‌లో సోమవారం చిన అప్పారావు శవమై తేలాడు. ఎస్ఐ లక్ష్మణరావు శవ పంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహన్ని అప్పగించినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి


పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం


బత్తిన అప్పారావు (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, ఆగస్టు 5: మండలంలోని పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని అదే గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు(55) అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొల్లు గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు, తుని వైపు నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో తన గ్రామం వద్ద రోడ్డు పక్క నుంచి నడిచి వెళుతున్నాడు. అక్కడ పక్కనే రెండు టిప్పర్ లారీలు ఆగి ఉన్నాయి. అప్పారావు వాటిని దాటుకొని కొంచెం ముందుకు వెళ్లే సరికి అదే మార్గంలో వస్తున్న మరో లారీ ఆగి ఉన్న టిప్పర్ లారీలను బలంగా ఢీకొంది. దీంతో ఓ టిప్పర్ లారీ ముందు వెళుతున్న అప్పారావు ఢీకొని అతని తల పైనుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..


మృతుడు లక్ష్మీసాయి కుమార్ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, ఆగస్టు 5: రైలు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. దీనికి సంబంధించి దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలి వున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన మద్దుకూరి లక్ష్మీసాయికుమార్ (24) స్థానికంగా గల ఎలక్ట్రికల్ షాప్‌లో పనిచేస్తూ లంకెలపాలెంలోని బంధువుల ఇంట్లో నివాసముంటున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి షాప్‌నకు వెళ్లే క్రమంలో స్థానిక రైల్వే క్రాసింగ్ వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. తల్లి సత్యవతి ఉంది. తండ్రి గతంలోనే మృతి చెందాడు. లక్ష్మీసాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు దువ్వాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా బస్సు ఢీకొని లేబర్ మేస్త్రీ


మృతుడు కె.అప్పారావు (ఫైల్)

లంకెలపాలెం, ఆగస్టు 5: ఫార్మాసిటీలోని ఓ ప్రైవేటు ఫార్మా పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. జాతీయ రహదారి లంకెలపాలెం దరి శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామానికి చెందిన కె.అప్పారావు (63) స్థానికంగా లేబర్ మేస్త్రీ పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనులపై ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ఫార్మా బస్సు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అప్పారావుకు భార్య చంద్రమ్మ, కుమారుడు కనకరాజు, కుమార్తె లీలావతి ఉన్నారు. ప్రస్తుతం అనకాపల్లి మండల బీజేపీలో నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. పరవాడ సీఐ బాల సూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన చంద్రకాంత్ (ఫైల్)

డుంబ్రిగుడ, ఆగస్టు 5: అదృశ్యమైన యువకుడు జాముగుడ సమీపంలోని పొలం గెడ్డ వాగులో మృతి చెందినట్టు స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30న కంచరపాలెంకు చెందిన బంగారి కోటేశ్వరరావు, ఈశ్వరి దంపతుల కుమారుడు చంద్రకాంత్(17) అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కోర్రాయి పంచాయతీ జాముగుడ పొలం గెడ్డ వాగులో యువకుడు మృతి చెందినట్టు సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మెకానిక్ అనుమానాస్పద మృతి


అల్లు అప్పారావు (ఫైల్)

దేవరాపల్లి, ఆగస్టు 5: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన క్రషర్లు, నీటి ఇంజన్లు మెకానిక్ అల్లు అప్పారావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తెనుగుపూడి మారేపల్లి రోడ్డు మార్గంలో చెరకు తోటల్లో మృతదేహన్ని పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీలు సోమవారం గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. ఇంజన్ రిపేరు చేస్తానని చెప్పి శనివారం ఇంటి నుంచి వెళ్లిన తన భర్త ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలిసి గాలించామని అప్పారావు భార్య దుర్గాలక్ష్మి భోరున విలపించింది. అప్పారావుకు పిల్లలు శ్యామ్ కళ్యాణ్, పూర్ణచందు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	77.00
లైవ్ ధర	97.00
విత్ స్కిన్	164.00
స్కిన్ లెస్	174.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

రైలు ప్రమాదం వెనుక సిబ్బంది నిర్లక్ష్యం

- ప్లాట్‌ఫారంపై అంతసేపు ఎందుకు ఉంచారు?
- బీ-6, బీ-7లలో గ్యాస్ సమస్య నిజమేనా!!
- స్మోక్ సెన్సార్ల సంగతి ఏమిటి?
- బీ-7టీటీఈ, ప్రయాణికులను విచారిస్తేనే నిజాలు


రైలు నుంచి మంటలు, పొగలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన కోర్బా ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం ఉందని చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఘటనలో అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు. రాయపూర్ నుంచి శనివారం బయలుదేరిన కోర్బా ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 6.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపై ఆగగా, ప్రయాణికులు అంతా దిగి వెళ్లిపోయారు. ఇదే రైలు కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లి క్లీనింగ్ ప్రక్రియ పూర్తిచేసుకుని తిరిగి స్టేషన్‌కు వచ్చి తిరుపతికి బయలుదేరి వెళుతుంది. కోచింగ్ కాంప్లెక్స్‌లో 22 కోచ్‌ల రైలును క్లీన్ చేయడానికి కనీసం నాలుగు గంటల సమయం తీసుకుంటారు. ఈ రైలు స్టేషన్‌కు వచ్చిన వెంటనే కోచింగ్ కాంప్లెక్స్‌కి వెళ్లాలి. తిరిగి ఒంటి గంటకల్లా స్టేషన్‌లో ఉండాలి. అప్పుడు తిరుపతి ప్రయాణికులు ఎక్కుతారు. అయితే ఏ కారణం చేతనో ఈ రైలును అదే ప్లాట్‌ఫారంపై వదిలేశారు. అగ్ని ప్రమాదం జరగడం, పొగలు రావడంతో 9.45 గంటలకు గుర్తించి సహాయక చర్యలు చేపట్టారు.

కోచింగ్ కాంప్లెక్స్‌లో దీనిని శుభ్రం చేసేందుకు నాలుగు గంటలు పడుతుందంటున్నారు. అక్కడి నుంచి బయలుదేరి తిరిగి స్టేషన్‌కి ఒంటి గంటకు చేరుకోవాలంటే...ఈ రైలును ఉదయం 8 గంటల కల్లా కోచింగ్ కాంప్లెక్స్‌కు చేర్చాల్సి ఉంది. కానీ ఉదయం 9.45 గంటల వరకు ప్లాట్‌ఫారంపైనే ఉంది. దీనికి కారణం ఏమిటనేది తెలియడం లేదు. కొన్నిసార్లు ప్లాట్‌ఫారంపైనే డ్రై క్లీనింగ్ చేస్తారు. ఆదివారం షెడ్యూల్ ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు. కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సి ఉందని తెలిపారు.

బీ-7, బీ-6 ఏసీ కోచ్‌లలో గ్యాస్ సమస్యతో ఏసీలు పనిచేయలేదని ప్రయాణికుల ఫిర్యాదు చేయడంతో విశాఖపట్నం చేరక ముందే విషయాన్ని ఆ రైలు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. ఈ సమస్యను సరిచేయడానికైనా రైలును కోచింగ్ కాంప్లెక్స్‌కు తీసుకువెళ్లాల్సి ఉంది. కానీ అలా చేయలేదు. ఎక్కడైతే సమస్య ఉందని చెప్పారో ఆ కోచ్‌లలోనే మంటలు రేగాయి. అంటే ఆ సమస్యే ప్రమాదానికి కారణమా?...అనేది తేలాల్సి ఉంది.

టీటీఈ, ప్రయాణికుల విచారణ ముఖ్యం

ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ ప్రారంభించారు. అయితే ఈ రైలు విశాఖపట్నం చేరడానికి ముందు బీ-7, బీ-6 కోచ్‌లలో ప్రయాణించిన వారి జాబితా తీసుకుని, వారి నుంచి ఆ బోగీల సమస్యపై అడిగి తెలుసుకోవాలి. వారు ఏమైనా ఫిర్యాదు చేశారా?, టీటీఈ దానిని ఎవరి దృష్టికి తీసుకువెళ్లారు? అనే విషయాలు తెలుస్తాయి. అలాగే ఈ రెండు బోగీలలో ఏదైనా సమస్య తలెత్తితే టీటీఈ వద్ద కూడా కొంత సమాచారం ఉంటుంది. వారి వాంగ్మూలాలు తీసుకొని, ఆ ప్రకారం విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయి.

స్మోక్ డిటెక్టర్లు ఎందుకు పనిచేయలేదు?

ఏసీ కోచ్‌లలలో పొగ వచ్చిందంటే వెంటనే స్మోక్ డిటెక్టర్ దానిని గుర్తించి సైరన్ మోగిస్తుంది. మరి అంత దట్టమైన పొగలు వస్తే ఆ డిటెక్టర్లు ఎందుకు సైరన్ మోగించలేదు? అనేది తేల్చాలి. మిగిలిన కోచ్‌లలో అవి ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

సీసీ టీవీ ఫుటేజీ..?

రైల్వేస్టేషన్‌లో ప్రతి ప్లాట్‌ఫారంపైనా సీసీ టీవీ కెమెరాలు ఉన్నాయి. నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపైకి కోర్బా రైలు వచ్చిన దగ్గర నుంచి ప్రమాదం జరిగేంత వరకు ఏమి జరిగిందో పుటేజీ ఉంటుంది. దానిని పరిశీలిస్తే ఆ రెండు బోగీలు బీ-7, బీ-6 వద్ద ఏ సమయంలో ఏమి జరిగిందో తెలుస్తుంది. దాని ప్రకారం విచారణ సులువు అవుతుంది.

ప్రతి కోచ్‌కు జనరేటర్లు

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లకు పైలట్ కోచ్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. దాంతో పాటు ప్రతి కోచ్‌కు జనరేటర్లు ఉంటాయి. ఏదైనా కారణంతో పైలట్ కోచ్ నుంచి విద్యుత్ రాకపోతే ఈ జనరేటర్లతో కోచ్ విద్యుత్ అవసరాలు తీరుస్తారు. బీ-7, బీ-6 కోచ్‌లో జనరేటర్లు ఎలా పనిచేస్తున్నాయి? వాటివల్ల సమస్య వచ్చిందా?..అనేది చూడాల్సి ఉంది.

అది ఖాళీ రైలు కిందే లెక్క

ప్రయాణికుల రైలును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరిన తరువాత బోర్డులు మార్చి ఇంకో ప్రాంతానికి పంపుతారు. ఆ మార్గంలో ఉన్నప్పుడు మాత్రమే ఆ రైలును ఆ పేరుతో వ్యవహరిస్తారు. బోర్డులు మార్చకుండా ప్లాట్‌ఫారంపై ఉంటే దానిని ఖాళీ రైలు(ర్యాక్)గానే పరిగణిస్తారు. దానికి ఏ పేరు ఉండదు. ఇప్పుడు ఈ ప్రమాదం కోర్బా రైలులో జరిగిందని ప్రచారం జరుగుతోంది. దీనిని రైల్వే వర్గాలు ఖండిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయానికి అది ఖాళీ ర్యాక్ అని, ఆ విధంగానే చూడాలని సూచిస్తున్నాయి.

అగ్ని ప్రమాదంపై విచారణ ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 5: విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై అధికారులు ఉన్నత స్థాయి విచారణ చేపట్టారు. ఈ అగ్ని ప్రమాదంలో ఒక ఏసీ కోచ్ పూర్తిగా, మరో రెండు కోచ్‌లు పాక్షికంగా దగ్ధమైన సంగతి తెలిసిందే. ప్రయాణికులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిన ఈ సంఘటనపై విచారణ చేపట్టేందుకు తూర్పుకోస్తారైల్వేకు చెందిన చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సూరత్ జానీ, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్ ఎస్‌పీ బెహరా, చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ బీఎస్.నాథ్ సోమవారం వాల్తేరు రైల్వే ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ప్లాట్‌ఫారంపై నిలిచి ఉన్న రైలులో మంటలు చెలరేగి, కోచ్‌లు దగ్ధం కావడంపై దర్యాప్తు చేపట్టారు. ముందుగా కోచింగ్ యార్డు, నిర్వహణ డిపోలో ఉన్న కోచ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందిని విచారించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బందిని కూడా విచారించి పలు వివరాలు సేకరించారు. మరోవైపు కోచ్‌లను తయారుచేసిన ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, లక్నో నుంచి రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో) ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోమవారం వాల్తేరు రైల్వే కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ బృందం పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి ప్రమాదం జరగడానికి గల కారణాలపై నివేదిక సమర్పించనున్నది.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం


అనకాపల్లి వెళ్లే రోడ్డులో నారపాడు జంక్షన్ వద్ద దెబ్బతిన్న రోడ్డు


అనకాపల్లి- నారపాడు రోడ్డులో బలిజపాలెం తమురు చెరువు వద్ద ఛిద్రమైన రోడ్డు

- అనకాపల్లి- నారపాడు రోడ్డు గోతులమయం
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

సబ్బవరం, ఆగస్టు 5: సబ్బవరం-అనకాపల్లి జాతీయ రహదారి నుంచి నారపాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో అమ్ములపాలెం, బలిజపాలెం, నారపాడు, నల్లరేగులు పాలెం గ్రామాలకు వెళ్లే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలే ఆధారం. ఈ రోడ్డు గత ఐదేళ్లుగా పూర్తిగా దెబ్బతినడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. నారపాడు జంక్షన్ నుంచి సబ్బవరం పరిధిలో అర కిలోమీటరు మేర రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ రోడ్డు బాగు చేయాలని గత కొన్ని పర్యాయాలుగా నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధి కారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

- సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన డాక్టర్ అశోక్‌కుమార్
- డీఎంఈ నుంచి తనకు సమాచారం లేదన్న ప్రస్తుత సూపరింటెండెంట్ శివానంద
- ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ వెళ్లిపోయిన పూర్వపు సూపరింటెండెంట్


డాక్టర్ శివానంద్


డాక్టర్ అశోక్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఉదయం హైడ్రామా నెలకొంది. లైంగిక వేధింపుల ఆరో పణలు, అనంతరం తలెత్తిన పరిణామాల నేపథ్యంలో గత సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ రెండు నెలలపాటు సెలవులో వెళ్లిపోయారు. ఆయన సెలవుపై వెళ్లడంతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ శివానందకు ఉన్నతాధికారులు అప్పగించారు. తదు పరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, సోమవారం ఉదయం అకస్మాత్తుగా మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆస్పత్రి పరిపాలనా విభాగానికి వచ్చారు. సూపరింటెండెంట్ కార్యాలయంలోకి వెళ్లి తాను బాధ్యతలు తీసుకుంటానంటూ ప్రస్తుత సూప రింటెండెంట్ శివానందకు తెలిపారు. ఇరువురు సుమారు అర్ధగంటపాటు లోపల చర్చించుకున్నారు. అయితే, డీఎంఈ కార్యాలయం నుంచి తనకు ఎటువంటి ఆదేశాలు రాలే దంటూ శివానంద్ వెల్లడించారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఉంటే చూపించాలని కోరారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ తనకు రాలేదని, అయితే ఉన్నతాధికారులు మాత్రం బాధ్యతలు తీసుకోవాలని చెప్పినట్టు అశోక్ కుమార్ వెల్లడించారు. మౌఖిక ఆదేశాల ప్రకారం తాను బాధ్యతల నుంచి తప్పుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని శివానంద్ చెప్పగా, లిఖిత పూర్వక ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ అశోక్ కుమార్ వెళ్లిపోయారు. ఈ వ్యవహారం ఆస్పత్రిలో చర్చ నీయాంశంగా మారింది. ఇదిలావుంటే సూపరింటెండెంట్ పోస్టుపై డీఎంఈ స్థాయిలో నిర్ణయం జరిగిందని చెబు తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టమైన ఆదే శాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ముందస్తు సమాచారం ఉండడం వల్లే డాక్టర్ అశోక్‌కుమార్‌కు వచ్చారా?, లేక ఇంకేదైనా కారణం ఉందా?...అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి అచ్చెన్నాయుడును కోరిన సంఘం నాయకులు


మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యలు వివరిస్తున్న శ్రీరామ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5: గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ, పశు సంవర్థకశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును విజయవాడలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెదబ్బాయి తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అంటువ్యాధులు ప్రబలి గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయన్నారు. దీని వల్ల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించామన్నారు. అన్ని రకాల నాణ్యమైన టీకాలు, డీవార్మింగ్ మందులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. గొర్రెలు, మేకలు పెంపకందారులకు రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రతి పెంపకందారుడికి 50 శాతం సబ్సిడీతో రూ.ఐదు లక్షలు రుణాలు ఇవ్వాలని కోరామని వారు తెలిపారు. అన్ని జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేసి ఒక్కొక్క జీవానికి రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి 50 శాతం సబ్సిడీతో రూ.15 వేలు విలువ గల మేలురకం విత్తన పొట్టేళ్లు ఇవ్వాలని కోరామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన పెంపకందారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరామన్నారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరినట్టు వారు తెలిపారు.

'చట్ట ప్రకారమే ఆ భూమి కొనుగోలు చేశాం'

అచ్యుతాపురం, ఆగస్టు 5: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపాలెంలో తాము చట్ట ప్రకారం భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నామని, కర్రి శివశంకర్ గణేష్, చోడిపల్లి మంగరాజు అనేవారు తెలిపారు. 'ఆగని వైసీపీ నేతల ఆగడాలు' అనే శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు వారు వివరణ ఇచ్చారు. హరిపురం సర్వే నంబర్ 102లో శృంగవరపు అమీరు కవి అనే ఎన్ఆర్ఐ పేరున కొంత భూమి ఉందని, అందులో సుమారు 27 సెంట్లకు ఆయన నుంచి జీపీ పొందిన అచ్యుతాపురం మండలం చోడపల్లికి చెందిన పంచదార్ల గజ్జాలు నుంచి తాము కొనుగోలు చేసినట్టు శివశంకర్ గణేష్ తెలిపారు. తాను కొనుగోలు చేసిన భూమికి గత నెల 27న సరిహద్దులు నిర్ణయించడానికి గజ్జాలు, సరిహద్దుదారులతో పాటు వెళ్లగా ఆ భూమికి ఎటువంటి సంబంధం లేని అచ్యుతాపురం మండలం చోడపల్లికి చెందిన శ్రీమంతుల నవీన్‌కుమార్, అనకాపల్లికి చెందిన సూర్ల హేమంతకుమార్, మరికొంతమంది కలిసి తనపై దాడి చేశారని ఆరోపించారు. తాను ఆ భూమిని కొనుగోలు చేశానని, ఈ విషయంలో ఎటువంటి విచారణ జరిపినా తాను సిద్ధమేనన్నారు. అలాగే తనపై వచ్చిన ఆరోపణలు కూడా నిజం కావని చోడిపల్లి మంగరాజు అన్నారు. తాను సర్వే నంబరు 71/2బి1లో భూమిని కొనుగోలు చేశానని, ఎటువంటి విచారణకైనా తాను కూడా సిద్ధమేనన్నారు.

టిడ్కో గృహాలకు త్వరలో విద్యుత్ వెలుగులు


టిడ్కో గృహాలకు విద్యుత్ లైన్ కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, ఆగస్టు 5 : మునిసిపాలిటీలో టిడ్కో గృహాలకు త్వరలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. బలిఘట్టంలోని 133/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్ వేయడానికి సర్వే చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరు పేదల కోసం 38 బ్లాకులలో 300, 360 చదరపు అడుగులు విస్తీర్ణంలో సింగిల్ బెడ్ రూమ్ ప్లాట్లు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పనలో నిర్లక్ష్యం చేయడంతో పనులు మందగించాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాలు పూర్తి చేసిన టిడ్కో గృహాలు 1,124 ఉన్నాయి. ఈ ప్లాట్లకు 3.6 మెగావాట్లు విద్యుత్ అవసరమని ఈపీడీసీఎల్ అధికారులు అంచనా వేశారు. మొత్తం ఐదు మెగావాట్ల సామర్థ్యంతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్య తలెత్తదని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఏపీ టిడ్కో సంస్థ ఈపీడీసీఎల్‌కి రూ.7 కోట్లు చెల్లించింది. బలిఘట్టంలో 5 ఎంవీఏ సామర్థ్యంతో విద్యుత్ సబ్ స్టేషన్ సిద్ధం చేశారు. మూడు ఫీడర్లు మీద విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇప్పటికే 38 బ్లాకులకు విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు అమర్చారు. బలిఘట్టంలోని 133/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్ వేయడానికి సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే విద్యుత్ సరఫరా చేయడానికి వీలు పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణారావు తెలిపారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

- 2 బైకులు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం


గంజాయిని, నిందితులను అరెస్టు చేసిన సీలేరు పోలీసులు

సీలేరు, ఆగస్టు 5 : ఒడిశా నుంచి సీలేరు మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న 10 కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాలిలా ఉన్నాయి. సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మారెమ్మ ఆలయం వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై ఒడిశా నుంచి ముగ్గురు వ్యక్తులు వస్తుండగా వాటిని తనిఖీ చేయగా.. రెండు ప్యాకెట్లలో పది కిలోల గంజాయి లభ్యమైందన్నారు. బైకులపై వచ్చిన సీలేరు దుర్గావీధికి చెందిన మండి శిరామ్ (28), చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదిలిగూడకు చెందిన పదో తరగతి చదువుతున్న పాంగి సునీల్ (18), నెల్లూరుకు చెందిన దక్షిణకుమార్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మంది ఓటర్లు
- 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మందితో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశామని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 636 మంది ఎంపీటీసీ సభ్యులు, 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 97 మంది కార్పొరేటర్లు, 53 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఇంకా ఎక్స్‌అఫీషియో సభ్యులు 16 మంది ఓటర్లుగా ఉంటారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈనెల 10వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేస్తామని, అదేరోజు నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖల సమయంలో అభ్యర్థిని పది మంది బలపర్చాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుపై ఎటువంటి పరిమితులు లేవన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు తహసీల్దారు నేతృత్వంలో మండల స్థాయిలో కమిటీలు వేశామన్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశామని ఆయన వివరించారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేర్ల నమోదుకు వైసీపీ నేతల దరఖాస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా తమ పేర్లు నమోదు చేయాలని వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజనరెడ్డి కోరా రు. ఈ మేరకు ముగ్గురూ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎంపీలు జీవీఎంసీలో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దరఖాస్తులు పరిశీలించిన తరువాత అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

గిరి ప్రదక్షిణలో లక్షలాది కొబ్బరికాయలు వినియోగం

సింహాచలం, ఆగస్టు 5 : గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు లక్షలాది కొబ్బరికాయలను వినియోగించారు. ఉత్సవానికి ముందు, ఆ తరువాత తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టడం ఆనవాయితీ. ఈమేరకు యాత్ర ప్రారంభానికి ముందు, తరువాత కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులు కొట్టిన కొబ్బరికాయలు సుమారు ఐదు టన్నులు ఉన్నట్టు అంచనా. ఉత్సవం ముగిసి పదిహేను రోజులు దాటినా కొబ్బరి ముక్కలను తరలించే పని ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ 15 రోజులు వర్షాలు కురవడంతో వాటిని ఎండబెట్టారు. ముక్కల నుంచి చిప్పలను వేరు చేయడానికి, తడిసిన ముక్కలను ఎండబెట్టడానికి తుని నుంచి రోజుకు రూ. 1000 చొప్పున పది మంది కూలీలను కాంట్రాక్టర్ రప్పించారు.

వరిలో కాలిబాటలు తప్పనిసరి

▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



వరిలో కాలిబాటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మోహన్‌రావు

నక్కపల్లి, ఆగస్టు 5 : వరి నాట్లు వేసేటప్పుడు కచ్చితంగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని చిన రాంభద్రపురం, దేవవరం, డొంకాడ, కాగిత, దోసలపాడు, ఉద్దండపురం గ్రామాల్లో వరి నాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. కాలిబాటల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించారు. నక్కపల్లి మండలంలో 4,400 ఎకరాల వరి సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకూ 850 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. సేంద్రియ ఎరువులు, బీజామృతం, ద్రవ జీవామృతంపై తెలియజేశారు. సబ్ డివిజన్ ఏవో రాకేశ్, మండల వ్యవసాయాధికారిణి ఉమా ప్రసాద్, రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులు చంద్రిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం మండల సమావేశం వాయిదా

▸ ఇరవై మంది ఎంపీటీసీ సభ్యులకు ఐదుగురు మాత్రమే హాజరు

▸ 45 నిమిషాలు వేచి చూసినా రాకపోవడంతో నిర్ణయాన్ని ప్రకటించిన ఎంపీడీవో సత్యనారాయణమూర్తి



సమావేశం వాయిదాను ప్రకటిస్తున్న ఎంపీడీవో

ఎస్.రాయవరం, ఆగస్టు 5 : కోరం లేక ఎస్.రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. తొలుత సోమవారం ఈ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి సభ్యులకు, అధికారులకు సమాచారం అందించారు. ఉదయం పదకొండు గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. మండలంలో మొత్తం ఇరవై మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, నిర్ణీత సమయానికి ఎంపీపీ లోవలక్ష్మితో కలిపి ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అనంతరం సుమారు 45నిమి షాల సమయం పాటు వేచి చూసినప్పటికీ సభ్యులు రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వస్తున్నట్టు ఎంపీడీవో ప్రకటించారు. దీంతో అప్పటికే అక్కడికి చేరుకున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు వెనుదిరిగారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డిప్యూటీ డీఈవో



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న అప్పారావు

ఎస్.రాయవరం, ఆగస్టు 5 : ఉపాధ్యాయులంతా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిని మరింత తీర్చిదిద్దాలని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు సూచించారు. మండలంలోని గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి పలువురు విద్యార్థులను సబ్జెక్టుల పరంగా ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం పథకంలో వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని వడ్డించాలన్నారు.

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

... 5వ పేజీ తరువాయి

నడకేనని అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ క్రాస్ ఓటింగ్ భయం కూడా వెంటాడుతోంది. కొత్తగా ఆరుగురు కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరుతున్నందున తమ బలం 53కి పెరుగుతుందని, తమలో ఒకరిద్దరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా ఇబ్బంది ఉండదని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లు కనీసం ఐదు స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేస్తున్నారు. తమ పార్టీ నుంచి టీడీపీ, జనసేనలో చేరినవారి కారణంగా ఆయా పార్టీల్లోని కార్పొరేటర్లు కొందరు అసంతృప్తితో ఉన్నారని, వారంతా తమ అభ్యర్థుల్లో కొందరికి మద్దతుగా ఓటేస్తారని చెప్పుకుంటున్నారు. స్టాండింగ్ కమిటీలో కనీసం ఐదు స్థానాలను దక్కించుకోవడమే లక్ష్యంగా వైసీపీ నేతలు వ్యూహరచనలో నిమగ్నమై ఉన్నారు. వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం ఉదయం పార్టీ కార్పొరేటర్లతో సమావేశం కానున్నట్టు సమాచారం. సమావేశం ముగిసిన వెంటనే కార్పొరేటర్లను రహస్య ప్రాంతానికి తరలించి, బుధవారం ఉదయం అక్కడ నుంచి ఓటేసేందుకు నేరుగా జీవీఎంసీ కార్యాలయానికి తీసుకురావాలనే వ్యూహంలో వైసీపీ నేతలు ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు స్టాండింగ్ కమిటీలో పదికి పది స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలో చేరాలనే ఆసక్తితో ఉన్నవారిలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సోమవారం జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతో చర్చించినట్టు తెలిసింది. కూటమికి చెందిన కార్పొరేటర్లను కూడా క్యాంపునకు తరలించే ప్రతిపాదన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా కూటమి, వైసీపీకి సమానబలం ఉండడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఎమ్మెల్సీపై కూటమి భేటీ

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఉన్నారు. సోమవారం రాత్రి నగరంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమికి చెందిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీల బలాబలాలు చర్చించిన నేతలు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికలకు అవసరమైన ఖర్చును భరించేందుకు గండి బాబ్జీ, పీలా గోవింద, తాతయ్యబాబు, పీవీజీ కుమార్‌లు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా అధిష్ఠానం సూచన మేరకు అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి అభ్యర్థిత్వంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే క్యాంపులు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. అభ్యర్థిత్వం ఆశిస్తున్న గండి బాబ్జీ, పీలా గోవింద్, తాతయ్యబాబు, పీవీజీ కుమార్, దిలీప్ చక్రవర్తి పేర్లు అధినేతకు పంపాలని సమావేశం నిర్ణయించింది. పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా నాగజగదీశ్వరరావు, పీఎన్‌వీ మాధవ్, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్, బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

తవ్వేస్తుండ్రు.. తరలించేస్తుండ్రు..

▸ మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు ▸ కన్నెత్తి చూడని అధికారులు ▸ విమర్శలు గుప్పిస్తున్న ప్రజలు



సోముదేవుపల్లి సమీపం జిరాయితీ భూమిలో మట్టిని తవ్వి ట్రాక్టర్‌కు లోడింగ్

ఎస్.రాయవరం, ఆగస్టు 5 : మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే కొంతమంది మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నా అధికారుల్లో స్పందన కానరావడం లేదు. ఇందుకు పెనుగొల్లు రెవెన్యూ పరిధి సోముదేవుపల్లి గ్రామ సమీపాన్నే ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడి ఓ జిరాయితీ భూమిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది ఎక్స్‌కవేటర్ సహాయంతో దర్జాగా మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టారు. సదరు మట్టిని సుమారు ఆరు ట్రాక్టర్ల ద్వారా పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాలకు తరలించి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారని ప్రచారంలో ఉంది. మట్టి తవ్విన చోటు నుంచి పట్టపగలే జాతీయ రహదారి మీదగా పెనుగొల్లు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాల వైపు ట్రాక్టర్లు తిరుగుతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇలా పలు గ్రామాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిరాతీ భూమిలోమట్టి తవ్వకాలపై డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామిని వివరణ కోరగా, మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



పెనుగొల్లు వద్ద ఓ కిరాణా షాపు ముందు అన్‌లోడ్ చేసిన మట్టి (ఫైల్ ఫొటోలు)

కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలపై ఆరా

▸ ఎవరికైనా పరిహారం చెల్లించాల్సి ఉంటే నివేదిక సిద్ధం చేయండి

▸ రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు ఆర్డీవో జయరాం సూచన



రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నక్కపల్లి, ఆగస్టు 5 : విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసిత రైతుల సమస్యలపై సోమవారం సాయంత్రం నర్సీపట్నం ఆర్డీవో జయరాం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడారు. భూమిలిచ్చిన నిర్వాసిత రైతుల్లో ఇంకా ఎవరికైనా పరిహారం చెల్లించాల్సి ఉంటే ఆ వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యతో ఎవరికైనా పరిహారం అందకపోతే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. కారిడార్ ప్రాంతానికి సంబంధించి రహదారి నిర్మాణానికి సేకరిస్తున్న భూములతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు శ్రీనుబాబు, పద్మజ, ఇన్‌చార్జి తహసీల్దార్ వీబీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్లు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోండి

▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు బాధితులు వినతి



కొణతాలకు బాధితుల సమస్యలు వివరిస్తున్న ప్రతినిధులు

కొత్తూరు, ఆగస్టు 5 : అధిక మొత్తాలను ఆశగా చూపి, డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థ నుంచి తిరిగి డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను పలువురు బాధితులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇక్కడ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, కార్యదర్శి గోపాల రమణ తదితరులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులు అమ్మి బాధితులందరినీ కాపాడాలని కోరారు. ఇప్పటికే బాధితులు బలవంతపు మరణాలకు, ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పెళ్లిళ్లకు, చదువుల నిమిత్తం దాచుకున్న సొమ్ము పదేళ్లయినా రాకపోవడంతో నిరాశ చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మొల్లేటి గోపాలరమణ, పి.శేష, రామఅప్పారావు, జె.దుర్గారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా ఇప్పించాలంటూ వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం, ఆగస్టు 5 : వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా పథకం కింద మత్స్యకారులకు అందజేస్తున్న పరిహారాన్ని వెంటనే ఇప్పించాలని కోరుతూ వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు సోమవారం ఎంపీపీ కోన లోవలక్ష్మి సమక్షంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి మే వరకు వేట నిషేధం విధించారన్నారు. మే నెలలో ఇవ్వాల్సిన పరిహారం ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆర్థికంగా ఇందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, ధూళి శ్రీను, ఎంపీటీసీ సూరిబాబు, వైసీపీ నేత కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టరేట్ ఎదుట స్కీమ్ వర్కర్ల ధర్నా



సమస్యలపై నినాదాలు చేస్తున్న స్కీమ్ వర్కర్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 : రాజకీయ వేధిపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద స్కీమ్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, శ్రీదేవి, జానకి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం : ఇద్దరిపై కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 : గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద తొమ్మిది మద్యం బాటిళ్లతో నీలకంఠరావు వీధికి చెందిన బి.ఆదిబాబు అనే వ్యక్తి పట్టుబడినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఆదిబాబు సోమవారం మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే, సుంకరమెట్ట జంక్షన్ వద్ద చౌడువాడకు చెందిన శరగడం వెంకటరమణ వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

హత్యకు గురైన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 : రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో దారుణ హత్యకు గురైన తొమ్మిదో తరగతి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సం ఘాలు సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. బాధిత కుటుంబానికి పునరావాస కల్పించాలని, నిర్భయ రిలీఫ్ ఫండ్ కేటాయించాలని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల అధికారులను కోరినట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ తెలిపారు. అధికారులను కలి సిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, ఐద్వా ప్రతినిధి ఆర్.లక్ష్మి, కొప్పుగొండుపాలెం మాజీ సర్పంచ్ బద్ది వెంకటరమణ తదితరులు ఉన్నారు.

వైస్ చైర్మన్ 'బెజవాడ'కు నేతల పరామర్శ

ఎలమంచిలి, ఆగస్టు 5 : మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు మాతృమూర్తి మంగమ్మకు టీడీపీ, వైసీపీ నాయకులు నివాళులర్పించారు. మంగమ్మ ఇటీవల మృతిచెందడంతో పట్టణంలోని ధర్మవరంలో గల నాగేశ్వరరావు స్వగృహం వద్ద సోమవారం పెద్దకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కన్నబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, రంగాసాయి తదితరులు వేర్వేరుగా నాగేశ్వరరావును పరామర్శించిన అనంతరం అంజలి ఘటించారు.

'ఆలయాల్లో ఆధ్యాత్మిక వేడుకలు'



రాంబిల్లిలో సమావేశమైన ఫౌండేషన్ ప్రతినిధులు

రాంబిల్లి, ఆగస్టు 5 : శ్రావణ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుందని, ఈ నెలలో చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి ఖండ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. రాంబిల్లిలో సోమవారం జరిగిన ఫౌండేషన్ మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ దేవాలయాలు కేంద్రంగా ప్రత్యేక పూజలు, భజనలు, సామూహిక హారతి, నగరసంగీకర్తన చేపట్టాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు సూరాడ నూకరాజు, వాడనర్సాపురం సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ ఎర్రయ్య పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : ప్రతి గ్రామంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు రక్షాబంధనం కార్యక్రమాన్ని అంతా ఘనంగా జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం రాజానగరం రామాలయంలో ఫౌండేషన్ పాయకరావుపేట మండల విస్తృత స్థాయి సమావేశం ఖండ సంజయ్ నీలాపు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల వద్ద వారానికి ఒకరోజు సత్సంగం, ఏకాదశి రోజున నగర సంకీర్తన, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి నిర్వహించేలా ప్రజలను చైతన్య పరచాలని నిర్ణయించారు. ఫౌండేషన్ ప్రతినిధులు తాడి సూరిమూర్తి, ధర్మప్రచారక్ కట్టా వీరబాబు, చేపల అప్పలరాజు, గరికిన సూరిబాబు, కోడ కాశి, పిరాది శ్రీను, వంకా రాము తదితరులు పాల్గొన్నారు.



రాజానగరం ఆలయంలో...

మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయండి



శిల్పికి వినతిపత్రం ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 : మట్టి వినాయక ప్రతిమలను ప్రజలు చక్కగా పూజించుకునే విధంగా తయారు చేయాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి కోరారు. పట్టణంలోని వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న పలువురు కళాకారులను సోమవారం కలిశారు. మట్టి వినాయక ప్రతిమల తయారీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వరాదన్నారు. కమిటీ ప్రతినిధులు ఎస్.చంద్ర, బొడ్డేడ భాస్కరరావు, బొడ్డేడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'క్షయ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ'



రికార్డులు పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి

కశింకోట, ఆగస్టు 5 : ఇక్కడి పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తుల రికార్డులను జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అయ్యప్ప రెడ్డి, ఎస్‌టీఎస్ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్య సేవలు, వారి ఆరోగ్య పరిస్థితి తదితరాలపై వైద్యాధికారిణి యశోద ద్వారా తెలుసుకున్నారు. ప్రతి కేసును ప్రతి నెలా ఫాలో అప్ చేసి తగిన వైద్యం అందిస్తున్నట్టు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ అధికారి ఫణిభూషణం, ఫీల్డ్ సూపర్‌వైజర్ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'సెబ్' సీజ్ చేసిన రెండు ఆటోల వేలం రేపు

సబ్బవరం, ఆగస్టు 5 : వివిధ కేసుల్లో పట్టుబడి సబ్బవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో ఉన్న రెండు ఆటోలను బుధవారం వేలం వేయనున్నట్టు స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఆసక్తిగలవారు సబ్బవరం సెబ్ కార్యాలయంలోని అధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు.

' పలు ఫార్మా యాజమాన్యాల తీరు దారుణం'

పరవాడ, ఆగస్టు 5 : విశాఖ ఫార్మాసిటీ (రాంకీ)లోని కొన్ని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పరవాడ పరిసర ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న సంఘటనలు ఫార్మా యాజమాన్యాల తీరుకు అద్దం పట్టే విధంగా ఉన్నాయన్నారు. కొన్ని ఫార్మా యాజమాన్యాలు వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా కాలువల ద్వారా గెడ్డల్లోకి విడిచిపెడుతున్నాయని, అవి సాగునీటి చెరువుల్లోకి చేరుతుండడంతో పూర్తిగా కలుషితమవుతున్నాయని వివరించారు. అయినప్పటికీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సరైన రీతిలో స్పందించకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

80 శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ

రాంబిల్లి, ఆగస్టు 5 : మండలంలోని దిమిలి, మురకాడ, కట్టుబోలు, కేజీపాలెం గ్రామాల్లోని రైతులకు సోమవారం ఎనభై శాతం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారిణి సి.సమంత తెలిపారు. ఇటీవల తుఫాన్ వల్ల పైగ్రామాల్లో వరి నారుమడుల దెబ్బతిని నష్టపోయిన నేపథ్యంలో సదరు రైతులకు రాయితీపై వరివిత్తనాలు అందించాలని ఆదేశాలు వచ్చాయన్నారు.

'వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5 : విశాఖ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా కలిసి పనిచేద్దామని ముఖ్య నేతలు పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్‌లు మాట్లాడారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును పార్టీ అధినేత జగన్ ప్రకటించారన్నారు. ఆయన గెలుపునకు అంతా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కొణతాల భాస్కరరావు, జాజుల రమేష్, దంతులూరి దిలీప్ కుమార్, రత్నకుమారి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు నోటిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈనెల 14న నామినేషన్లు పరిశీలిస్తామన్నారు. నామినేషన్లు ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉంటుందన్నారు. తదుపరి బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించి బ్యాలెట్ ముద్రణ చేపడతామన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలు ఉండవని, కేవలం బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని, కేంద్రాల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. కోడ్ ఉన్నందున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయరాదన్నారు. మూడు జిల్లాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటుచేసే సమావేశాలకు అధికారులు హాజరుకారాదని స్పష్టంచేశారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సీతారామమూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ బకాసురుడు

... 5వ పేజీ తరువాయి

చోట్లా ఆక్రమణలకు గురైన భూమి విలువ రూ.25 కోట్లకు పైనే ఉంటుందని రెవెన్యూ మాజీ ఉద్యోగి ఒకరు తెలిపారు.

మాజీ మంత్రికి బహుమతిగా కారు

ఇరువాడ, గొటివాడ, సబ్బవరంలో రియల్టర్ ఆక్రమించుకున్న భూముల వ్యవహారంలో భారీగా డబ్బులు, భూమి, ప్లాట్లు చేతులు మారాయని ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఓమంత్రికి రియల్టర్ ఖరీదైన కారు, రెవెన్యూ సర్వే, పోలీసు అధికారులకు బినామీ పేర్లతో ప్లాట్లు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. రెండు చోట్ల ఆక్రమణలపై అనకాపల్లి కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని రైతులు కోరుతున్నారు. వాగులు, ప్రభుత్వ భూముల సర్వే రాళ్లు తొలగించిన వ్యవహారంపై ప్రస్తుత అనకాపల్లి రెవెన్యూ డివిజన్, జిల్లా సర్వేశాఖ, సబ్బవరం తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో కాకుండా ఇతర డివిజన్‌ల అధికారులతో విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆక్రమణలకు పాల్పడిన రియల్టర్‌పై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కేసు నమోదుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుండగా ఈ అక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు ఫిర్యాదుచేయాలని రైతులు నిర్ణయించారు.

అనుమతుల్లేని ఆస్పత్రులెన్నో!

... 5వ పేజీ తరువాయి

రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని రోగులు చెబు తున్నారు.

పర్యవేక్షణ కరువు

నిబంధనల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రతి మూడు నెలలకొకసారి ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలి. గడువు ముగిసిన ఆస్పత్రులు రెన్యూవల్ చేయించుకోవలసి ఉంటుంది. అయితే వైద్య ఆరోగ్య శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. బయో వ్యర్థాలను సేకరించే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవలసి ఉండగా, అటువంటిదేమీ లేకుండా ఆస్పత్రుల నిర్వాహకులు వాటిని డ్రైనేజీల్లో పారేస్తున్నారు. పూడిమడక వంటి మత్స్యకార గ్రామాల్లో ఆర్ఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటుచేసి ఒక గదిలో మంచాలు వేసి చికిత్సలు కూడా చేసేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖాధికారులు స్పందించి తనిఖీలు చేసి అనుమతులు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అనకాపల్లి రోడ్డులో ఆస్పత్రి

నర్సీపట్నం నియోజకవర్గం

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం



వైడీపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నాతవరం, ఆగస్టు 5 : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇస్తే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న అన్నారు. వైడీ పేటలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్న తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమన్నారు. బిడ్డకు పాలు ఇచ్చే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీ డీఎస్ సూప ర్‌వైజర్లు ఎ.నాగజ్యోతి, ఎ.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'సాగునీటి చెరువుల్లో ఉపాధి పనులు'

గొలుగొండ, ఆగస్టు 5 : మండలంలోని సాగునీటి చెరువుల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా పూడికతీత, ఇతర పనులు చేపట్టే ముందుగా ఇరిగేషన్ సిబ్బందికి ఆయా రైతులు సమాచారం అందించాలని ఆ శాఖ ఏఈ సూర్యనా రాయణ గురువారం కోరారు. సాగునీటి చెరువుల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు గట్లు పది మీటర్లు ఎత్తు పెంచడం జరుగుతందన్నారు. వర్షాల సమయంలో మదుంలు, పొర్లు కట్లు కోతకు గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా ఈ చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఉపాధి సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

700 మూగజీవాలకు వైద్యసేవలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 5 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం శివాలయ వద్ద సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, కొంగసింగి, రత్నంపేట, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన పాడి రైతులు సుమారు ఏడు వందల మూగ జీవా లను ఈ శిబిరానికి తీసుకు వచ్చారు. ఏఎల్‌పురం, చోద్యం ప్రభుత్వ పశు వైద్యశాలల వైద్యులు డాక్టర్ శిరీషా, డాక్టర్ రామ్మోహన్ బృందం పరీక్షలు జరిపారు. చాలావాటికి గాలి కుంటువ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై మరింత శ్రద్ధ

▸ వసతి గృహ సంక్షేమాధికారుల సమీక్షలో ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల

నర్సీపట్నం, ఆగస్టు 5 : వసతి గృహాల్లో విద్యార్థులపై మరింత దృష్టి సారిం చాలని, వారంలో ఒక గంట వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కెరియర్ గైడ్‌లెన్స్‌పై అవగాహన కల్పించాలని ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల సూచించారు. సోమవారం ఆమె ఇక్కడ వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల సమక్షంలోనే విద్యార్థు లను హాస్టల్ నుంచి బయటకు పంపాలని సూచించారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. హాస్టర్ విద్యార్థుల బయో మెట్రిక్ హాజరుకు సంబంధించి ఆధార్ ఈకేవైసీ అవ్వని వారిని సచివాలయాలకు తీసుకు వెళ్లి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల న్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం, నీటి నిల్వల వల్ల అర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



వార్డెన్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల

'మధ్యాహ్న భోజన'ంలో నాణ్యత తప్పనిసరి : ఎంఈవో



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న నాగేంద్ర

నర్సీపట్నం, ఆగస్టు 5 : మధ్యాహ్న భోజన పథకం నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో-2 నాగేంద్ర అన్నారు. మం డలంలోని ఎరకన్నపాలెం ఎంపీపీ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకు న్నారు. కిచెన్ గార్డెన్, మధ్యాహ్న భోజనం నాణ్యత ను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు అధికా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయుడు ఆళ్ళ వరప్రసాద్ పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేశాకే ఉపాధ్యాయుల సర్దుబాటు

యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి

గొలుగొండ, ఆగస్టు 5 : విద్యా రంగంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యుటీఎఫ్ జిల్లా ఉపాధ్య క్షురాలు గాయత్రి, ప్రతినిధులు పోతురాజు, చిట్ల అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఇన్ చార్జి ఎంఈవో ఒ.సత్యనారాయణ, మండల పరి షత్ కార్యాలయం ఏవో సత్యనారాయణలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేశాకే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాలను నిర్వహించాలని కోరారు. అలాగే పద్దెనిమిది సమస్యలను అం దులో వివరించారు. ఈ కార్యక్రమంలో పలు వురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతి అందిస్తున్న ప్రతినిధులు

ఏపీఐఐసీ రికార్డుల నుంచి జిరాయితీ భూములు తొలగించండి

▸ రాచపల్లి రైతులు వేడుకోలు

మాకవరపాలెం, ఆగస్టు 5 : మండలం లోని రాచపల్లి రెవెన్యూలో ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన జిరాయితీ భూముల జాబితా తొలగిం చాలని రాచపల్లి రైతులు కోరుతున్నారు. 2008లో అన్‌రాక్ కంపెనీ భూసేకరణ చేపట్టింది. ఇందులో భాగంగా 2,400 ఎకరాల భూమిని తీసుకుంది. అ యితే రైతులు సాగు చేస్తున్న మరో 300ఎకరాల భూమిని ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైంది. నాటి నుంచి రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఏపీఐఐసీ రికార్డుల నుంచి సదరు భూములు తొలిగించలేదు. ఇప్పటికీ అదే రికా ర్డుల్లో నమోదై ఉండడంతో సాగు తప్ప, ప్రభుత్వ పథకాలు ఏవీ పొందలేకపోతున్నామని ఆయా రైతులు వాపోతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూముల రీసర్వే చేసినా ఈ భూమిని ఆన్‌లైన్ చేయలేదన్నారు. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయా ల్సిందిగా ఆయా రైతులు వేడుకుంటున్నారు.

నేడు నోటిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు (ప్రభు త్వ సెలవు దినాలు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీక రిస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎ న్నికల అధికారిగా, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈనెల 14న నామినేషన్లు పరిశీలిస్తామన్నారు. నామినేషన్లు ఉపసంహరణ కు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గ డువు ఉంటుందన్నారు. తదుపరి బరిలో ఉన్న అభ్యర్థుల వివ రాలు ప్రకటించి బ్యాలెట్ ముద్రణ చేపడతామన్నారు. ఎన్నిక ల్లో ఈవీఎంలు ఉండవని, కేవలం బ్యాలెట్ పత్రాలు వినియో గిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని, కేంద్రాల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామన్నా రు. ఎన్నికల సంఘం జారీచేసిన ప్రవర్తనా నియమావళిని త ప్పకుండా పాటించాలన్నారు. కోడ్ ఉన్నందున ప్రారంభోత్సవా లు, శంకుస్థాపనలు చేయరాదన్నారు. మూడు జిల్లాల్లో రాజకీ య నాయకులు ఏర్పాటుచేసే సమావేశాలకు అధికారులు హా జరుకారాదని స్పష్టంచేశారు. సమావేశంలో ఎన్నికల రిటర్నిం గ్ అధికారి, జేసీ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సీతారా మమూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొబైల్ వ్యాన్ ద్వారా పశు వైద్య సేవలు

నాతవరం, ఆగస్టు 5 : పాడి రైతులు మొబైల్ వ్యాన్ ద్వారా అందిస్తున్న సేవల ను సద్వినియోగం చేసుకోవాలని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు కోరారు. సోమవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు మండలానికి మొబైల్ వ్యాన్ లేకపోవడం, నాతవరం పశు వైద్య కేంద్రంలో వైద్యుడు లేకపోవడం వంటి అంశాలను స్పీకర్ అయ్యన్న పాత్రుడు దృష్టికి తీసుకు వెళ్లగా సోమవారం నుంచి నాతవరంలో పాడిరైతులకు మొబైల్ వ్యాన్‌ను అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేశారన్నారు. జీరెడ్డి రాజు బాబు, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ చిటికెల రాజుబాబు పాల్గొన్నారు.

భూ బకాసురుడు

... 5వ పేజీ తరువాయి

చోట్లా ఆక్రమణలకు గురైన భూమి విలువ రూ.25 కోట్లకు పైనే ఉంటుందని రె వెన్యూ మాజీ ఉద్యోగి ఒకరు తెలిపారు.

మాజీ మంత్రికి బహుమతిగా కారు

ఇరువాడ, గొటివాడ, సబ్బవరంలో రియల్టర్ ఆక్రమించుకున్న భూముల వ్యవహా రంలో భారీగా డబ్బులు, భూమి, ప్లాట్లు చేతులు మారాయని ప్రచారం జరుగు తోంది. గత ప్రభుత్వంలో ఓ మంత్రికి రియల్టర్ ఖరీదైన కారు, రెవెన్యూ, సర్వే పోలీసు అధికారులకు బినామీ పేర్లతో ప్లాట్లు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. రెండు చోట్ల ఆక్రమణలపై అనకాపల్లి కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని రైతులు కోరుతున్నారు. వాగులు, ప్రభుత్వ భూముల సర్వే రాళ్లు తొలగించిన వ్యవహారంపై ప్రస్తుత అనకాపల్లి రెవెన్యూ డివిజన్, జిల్లా సర్వేశాఖ, సబ్బవరం తహసీల్దారు కా ర్యాలయ సిబ్బందితో కాకుండా ఇతర డివిజన్‌ల అధికారులతో విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆక్రమణలకు పాల్పడిన రియల్టర్‌పై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కేసు నమోదుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలావుండగా ఈ అక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫి ర్యాదుచేయాలని రైతులు నిర్ణయించారు.

హోరాహోరీగా స్థాయీ సంఘం పోరు

... 5వ పేజీ తరువాయి

నడకేనని అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ క్రాస్ ఓటింగ్ భయం కూడా వెంటాడుతోంది. కొత్తగా ఆరుగురు కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరుతున్నందున తమ బలం 53కి పెరుగుతుందని, తమలో ఒకరిద్దరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా ఇబ్బంది ఉండదని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు వైసీపీ కా ర్పొరేటర్లు కనీసం ఐదు స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేస్తున్నారు. తమ పార్టీ నుంచి టీడీపీ, జనసేనలో చేరినవారి కారణంగా అయా పార్టీల్లోని కార్పొ రేటర్లు కొందరు అసంతృప్తితో ఉన్నారని, వారంతా తమ అభ్యర్థుల్లో కొందరికి మద్ద తుగా ఓటేస్తారని చెప్పుకుంటున్నారు. స్టాండింగ్ కమిటీలో కనీసం ఐదు స్థానాలను దక్కించుకోవడమే లక్ష్యంగా వైసీపీ నేతలు వ్యూహరచనలో నిమగ్నమై ఉన్నారు. వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం ఉదయం పార్టీ కా ర్పొరేటర్లతో సమావేశం కానున్నట్టు సమాచారం. సమావేశం ముగిసిన వెంటనే కా ర్పొరేటర్లను రహస్య ప్రాంతానికి తరలించి, బుధవారం ఉదయం అక్కడ నుంచి ఓటేసేందుకు నేరుగా జీవీఎంసీ కార్యాలయానికి తీసుకురావాలనే వ్యూహంలో వైసీపీ నేతలు ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు స్టాండింగ్ కమి టీలో పదికి పది స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలో చేరాలనే ఆసక్తితో ఉన్నవారిలో ఎవరిని తీసుకోవాలనే దా నిపై సోమవారం జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుతో చర్చించి నట్టు తెలిసింది. కూటమికి చెందిన కార్పొరేటర్లను కూడా క్యాంపునకు తరలించే ప్రతిపాదన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా కూటమి, వైసీపీకి సమాన బలం ఉండడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

చోడవరం నియోజకవర్గం



ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఅండ్‌హెచ్‌వో బాలాజీ

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బాలాజీ

రోలుగుంట, ఆగస్టు 5: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బాలాజీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బుచ్చింపేట ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజ నల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై డాక్టర్ సునీతను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రికార్డులు, మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన

బుచ్చెయ్యపేట, ఆగస్టు 5: అవయవాలను దానం చేయడం ద్వారా ఎనిమిది మంది ప్రాణాలను కాపాడవచ్చునని అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు అన్నారు. అవయదానంపై సోమవారం నిర్వహించినఅవగా హన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అవయవాలు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 సంవత్స రాల వయస్సు వచ్చిన తర్వాత ఎవరైనా అవయవ దానం కోసం తమను తాము నమోదు చేసుకోవచ్చునన్నారు. వడ్డాది హెచ్‌ఎం. టి.వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

రాజాంలో డెయిరీ సంఘం అధ్యక్షుడిగా రమణ

బుచ్చెయ్యపేట: రాజాం పాల సంఘం అధ్యక్షుడిగా ఎస్.రమణ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా ఎం.సత్యారావు, ఎం.వరహాలమ్మతో పాటు మరి కొందరు ఎన్నికయ్యారు.

దైవ సంకల్పంతోనే సేవా కార్యక్రమాలు: ఎమ్మెల్యే రాజు

రావికమతం, ఆగస్టు 5: దైవ సంకల్పంతోనే సేవా కార్యక్రమాలు సాధ్య మని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండల కేంద్రంలోని శివాలయం ఆర్చ్ నిర్మాణానికి సింగర్ల మహాలక్ష్మినాయుడు ఇచ్చిన రూ.2 లక్షల విరాళంతో సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శివాలయం ఆవరణలో కల్యాణ మండలం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యేని కోరగా మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ ఆంజనేయ స్వామి, లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే రాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పులూరి నాగేశ్వరావు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, గంజి రమణ, నానిబాబు, జనసేన నాయకులు సూరిబాబు, భూషణం తదితరులు పాల్గొన్నారు.



రావికమతం శివాలయం ఆర్చ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

▸ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

చోడవరం, ఆగస్టు 5: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ, జిల్లాలో వైసీపీకి 800 మంది సభ్యుల బలం ఉందన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 146 మంది సభ్యుల బలం వైసీపీకి ఉందని, ఇందులో అసంతృప్తివాదులు 20 మంది తగ్గినా 120 మంది వరకు బలం ఉందని చెప్పారు వీరంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి తనకు అండగా నిలబ డాలని కోరారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తరువాత జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక ఒక గొప్ప మలుపునకు నాంది కాబోతుందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై ఎవరికీ భేదాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో వైసీపీ సభ్యులంతా పార్టీ విజయానికి కట్టుబడి ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైసీపీ నాయకులు ఎస్.చినఅప్పలనాయుడు, ఈర్లె అనూరాధ, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ఎంపీపీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, సుంకర శ్రీను, తాళపురెడ్డి రాజారాం, గాడి కాసు, స్థానిక నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువ కవి లక్ష్మణరావుకు కవి కేసరి జాతీయ పురస్కారం

రావికమతం, ఆగస్టు 5: మండలంలోని టి.అర్జాపురం గ్రామానికి చెందిన సాహితీ వేత్త గుంటూరు లక్ష్మణరావుకు కవి కేసరి జాతీయ పురస్కారాం అందుకు న్నారు. గ్రామంలో శ్రీబాల వరసిద్ధి వినా యక అలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న లక్ష్మణరావుకు పలు ప్రక్రియల్లో రచనలు, వివిధ కథలు పద్య, కవితలు రాస్తూ, సామాజిక చైత న్యం కలిగిస్తుంటారు. ఇందులో భాగంగా కథా విశారద, తెలుగుశ్రీ, వెలుగుదివ్వె, కవిమిత్ర, దవ్యజ్యోతి, జ్యోతిర్మయి, కవిశేష్ఠ, కవిశేఖర, కవి శారద, కవిభాస్కర, కవీశ్వర, చిమ్నీ విభూషణ, మధురకవి విభూషణ, ఆంధ్రకేసరి-సేవారత్న, పుడమి రత్న వంటి పలు సంస్థలు నుంచి ఇప్పటికే ఈయన ఉత్తమ రచ యిత పురస్కారాలు అందుకున్నారు. తాజాగా భద్రాది సాహితీ వేదిక, భద్రాది, కొత్తగూడెం, తెలంగాణ వారు రోజుకొకటి చొప్పున హరివిల్లు కవి తలు మాత్రా ఛందస్సుతో కూడిన 1500 కవితలు రాశారు. దీంతో లక్ష్మణరా వుకు హరివిల్లు కవికేసరి జాతీయ పురస్కారం లభించింది.



కవి లక్ష్మణరావు

సహారా సొమ్ము ఇప్పించండి

దేవరాపల్లి, ఆగస్టు 5: సహారా ఇండియాలో పొదుపు చేసిన సొమ్మును ఖాతాదారులకు ఇప్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మండల కార్యదర్శి బి.టి.దొర అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైసాపైసా కూడబెట్టి భవిష్యత్‌లో ఉపయోగ పడుతుందని పొదుపు చేస్తే సంస్థ మోసం చేసిందని వాపోయారు. దేశ వ్యాప్తంగా రెండున్నర కోట్లు మంది బాధితులు సహారా ఇండియా చేసిన మోసా నికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. గత ఏడాది కేంద్ర మంత్రి అమిత్‌షా దశల వారీగా పంపిణీ చేస్తామని చెప్పిన నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. పార్టీ నేతలు సిహెచ్.దేముడు, బి.నాగేశ్వరరావు, దొంగబాబు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

చీడికాడ, ఆగస్టు 5: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పొట్నూరు రమేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు నైట్‌డ్యూటీలు నిలుపుదల చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు సీనియారిటీని బట్టి అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్‌వో పోస్టులతో పదోన్నతి కల్పించాలని, వేతనాలు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలు రెవెన్యూ వ్యవస్థలో ప్రజలకు అనేక రూపాల్లో సేవలు అందిస్తున్నా, వారికి మాత్రం సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం అమలు చేయలేదన్నారు. సంఘం నాయకులు నాగేష్, గాలి తాతబాబు, రమణ, ప్రసాద్, నాయుడు, లావణ్య, గణేష్ పాల్గొన్నారు.

చెరువులకు జలకళ...

మాడుగుల రూరల్, ఆగస్టు 5: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన ఏకదాటి వర్షాలకు చెరువుల్లో పుష్కలంగా నీరు చేరింది. మండలంలో చిన్నాపెద్దా కలిపి సుమారు 60 చెరు వులు ఉన్నాయి. చెరువు కింద ఆయకట్టు భూములకు నీరు అందుతుండడంతో రైతులు పొలం పనులపై దృష్టిసారించారు. ఈ ఏడాది చెరువు కింద ఆయకట్టు భూములు దమ్ములు, వరినాట్లకు అనుకూలంగా ఉన్నాయని రైతులు తెలిపారు.

ఎమ్మెల్సీపై కూటమి భేటీ

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఉన్నారు. సోమవారం రాత్రి నగరంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమికి చెందిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీల బలాబలాలు చర్చించిన నేతలు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి అభిప్రాయా లు తెలుసుకున్నారు. ఎన్నికలకు అవసరమైన ఖర్చును భరించేందుకు గండి బా బ్జీ, పీలా గోవింద, తాతయ్యబాబు, పీవీజీ కుమార్‌లు సిద్ధమయ్యారు. ఈ సంద ర్భంగా అధిష్ఠానం సూచన మేరకు అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి అభ్యర్థిత్వంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే క్యాంపులు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. అభ్యర్థిత్వం ఆశిస్తున్న గండి బాబ్జీ, పీలా గోవింద్, తాతయ్యబాబు, పీవీజీ కుమార్, దిలీప్ చక్రవర్తి పేర్లు అధినేతకు పంపాలని సమావేశం నిర్ణయించింది. పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బం డారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బా బు, కేఎస్ఎన్ఎస్ రాజు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా నాగజగదీ శ్వరరావు, పీఎన్‌వీ మాధవ్, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సు ధాకర్, బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

పైనాపిల్ ధర పతనం

రూ.10కే అమ్ముడైన పండు

మాడుగుల, ఆగస్టు 5: పాడేరు ఏజెన్సీలోని పలు మండలాల గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించిన పైనాపిల్ పండ్లకు ఈ వారం దిగుబడి తక్కువగా వచ్చినప్పటికీ ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. సలుగు, పులుసుమామిడి, కక్కి, వంట్లమామిడి, కందుల పాలెం, ఈదులపాలెం, దేవాపురం, చింతగరువు ప్రాంతాల నుంచి విక్రయించేందుకు ఇక్కడ సోమవారం వారపు సంతకు తీసుకు వచ్చారు. ఫైనాఫిల్‌ను నెత్తిన, కావిళ్లతో మోసుకు రావడంతో పాటు వాహనాలపై తీసుకునివచ్చి విక్రయించారు. తొలిదశలో ఒక్కో పండు 10 రూపాయల వరకు అమ్ముడయ్యాయి. అనంతరం ఒక్కోపండు 8రూపాయలకు విక్రయించారు. అయినప్పటికీ కొనుగోలుదారులు లేక రైతులు డీలా పడ్డారు. మిగిలిపోయిన ఫైనాపిల్‌ను గురువారం సంతలో విక్రయించుకోవచ్చునని మాడుగులలో సంత ప్రాంగణంలో ఉన్న ఇళ్ల వద్ద నిల్వ చేశారు. దూర ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో తీసుకొచ్చిన ఫైనాఫిల్‌కు ధర పలకకపోవడంతో గిరిజన రైతులు తీవ్ర నిరాశ చెందారు.

రైతుల వివరాలు అందించండి

సహకార సంఘం సీఈవో కనకారావు

దేవరాపల్లి, ఆగస్టు 5: దేవరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులు కంప్యూటరీకరణ ద్వారా పొందుపర్చడానికి వివరాలు అందజేయాలని సంఘం సీఈవో ఎస్.కనకారావు సోమవారం తెలిపారు. ఆధార్ జెరాక్సుతో పాటు ఆధార్ అనుసంధానం చేసిన ఫోన్ నంబరు ఇవ్వాలని సూచించారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

దేవరాపల్లి, ఆగస్టు 5: వ్యాధి నిరోధకశక్తిని ఇచ్చే తల్లి పాలు బిడ్డకు అన్ని రకాల శ్రేయస్కకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని అన్నారు. మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో సోమవారం తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. పోషక విలువలు అందించే అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పౌష్టికాహార పదార్థాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. వాటి గురించి సరోజిని ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఈ ఆహార పదార్థాలు తీసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది సత్యవతి, జె.అనంతలక్ష్మి, సిహెచ్.లక్ష్మి, ఎస్.చిన్నమ్మలు, ఎ.వరలక్ష్మి పాల్గొన్నారు.

కోళ్ల ఫారంలో వైర్ల దొంగలు

దేవరాపల్లి, ఆగస్టు 5: మండలంలోని సీతంపేట శివారు నిర్మా ణంలో ఉన్న కోళ్ల ఫారంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. కోళ్ల ఫారం చుట్టూ వేసిన ఇనుప కంచెను కత్తిరించి లోపలికి చొరబడి వస్తువులను ధ్వంసం చేశారు. అలాగే విలువైన విద్యుత్ తీగలను అపహరించారు. నిర్వాహకుడు పి.నాగభూషణం ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల్లేని ఆస్పత్రులెన్నో!

... 5వ పేజీ తరువాయి

రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని రోగులు చెబుతున్నారు.

పర్యవేక్షణ కరువు

నిబంధనల ప్రకారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రతి మూడు నెలలకొకసారి ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలి. గడువు ముగిసిన ఆస్పత్రులు రెన్యూవల్ చేయించుకోవలసి ఉంటుంది. అయితే వైద్య ఆరోగ్య శా ఖాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకు లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. బయో వ్యర్థాలను సేకరించే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవలసి ఉండగా, అటువంటిదేమీ లేకుండా ఆస్పత్రుల నిర్వాహకులు వాటిని డ్రైనేజీల్లో పారేస్తున్నారు. పూడిమడక వంటి మత్స్యకార గ్రామాల్లో ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటుచేసి ఒక గదిలో మంచాలు వేసి చికిత్సలు కూడా చేసేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖాధికారులు స్పందించి తనిఖీలు చేసి అనుమతులు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.